ప్రజాశక్తి

మంగళవారం 30 జనవరి 2024 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల

డబ్బుంటేనే టికెట్..!

- వైసిపి, తెలుగుదేశం పార్టీల్లో అభ్యర్థులకు ఇదే అర్హత
- అసెంబ్లీకి రూ.50 కోట్లు.. ఎంపీకి రూ.100 కోట్లకు పైనే..
- ఎన్నికలను పూర్తిగా డబ్బు, సామాజికవర్గంతో ముడిపెట్టేసిన పార్టీలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

డబ్బుంటేనే ఇప్పుడు అభ్యర్థి.. వైసిపి అయినా, తెలుగుదేశం పార్టీ అయినా టిక్కెట్ ఇవ్వాలంటే ఇదే ఇప్పుడు ప్రధాన అర్హత. డబ్బు లేకుంటే ఎంతటి సీనియర్ నేత అయినా ఇంటి వద్ద కూర్చోవాల్సిందే. వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి మార్కాపురం టిక్కెట్టు దాదాపుగా ఖరారు చేసినట్లే చేసిన ఆ పార్టీ అధిష్టానం.. చివరికి ఆయన వద్ద డబ్బు లేదనే కారణంతో నిలిపేసింది. డబ్బు పెట్టుకుంటామన్న వారికే టిక్కెట్టు ఖరారు చేసే పరిస్థితికి వచ్చింది. ఇదొక ఉదా హరణ మాత్రమే. ఇప్పుడు టిక్కెట్టు ఖరారైన అందరి పరిస్థితీ ఇదే.

అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎస్సీ, బీసీ అభ్యర్థులైతే కనీసం రూ.30 కోట్లు పెడ తామన్న వారికే ఇచ్చారు. జనరల్ స్థానాల్లో రూ.50 కోట్లు కనీసం ఉం డాలని షరతు పెట్టారు. ఈ స్థాయిలో నగదు చూసు కోలేక చాలా మంది అవస్థలు పడుతున్నారు. ప్రతిపక్షం నుంచి పోటీ చేస్తున్న నేతలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడి పోగు చేసుకుం టున్నారు. ఆస్తులు తాకట్టు పెడుతున్నారు. అమ్మేసుకుం టున్నారు. ఏదో రకంగా పార్టీల వద్ద డిపాజిట్ చేస్తున్నారు. పార్టీలో బాగా సేవ చేసి అక్కడ ఇంకెవరూ లేరనే ఒకటీ రెండు నియోజక వర్గాల్లోనే అదీ రిజర్వుడు అభ్యర్థు లకు పార్టీలు పెట్టేందుకు సిద్ధమయ్యాయి. అది కూడా సమీపంలోని ఉండే పార్టీ విధేయులు, వ్యాపార వర్గాల్లో ఉన్న పార్టీ సానుభూతి పరులకు బాధ్యత అప్పగిస్తున్నారు. ఇప్పుడు అభ్యర్థులకు సహకరిస్తే అధికారంలోకి వచ్చాక మీకు అవసరమైన పనులు చేసి పెడతామంటున్నారు. జిల్లాలో అభ్య ర్థులకు ఎక్కువశాతం నిధులు గ్రానైట్ రంగం నుంచే సమకూరు తున్నాయి. వాటిపైనా రాజకీయ దాడులు తప్పడం లేదు. అధికారం లో ఎవరుంటే వారికే ఆ క్వారీ సంపద దక్కుతోంది. లేకుంటే దాడు లతో లాగేసుకుంటున్నారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ క్వారీలు, పరిశ్రమలను ఏరకంగా మూసేశారో చూశాం. ఇప్పుడు అదే స్థానంలో మొన్నటివరకూ ఇన్‌ఛార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్యపై ఇప్పుడు గురిపెట్టారు. పార్టీ ఫిరాయించేందుకు ఆయన సన్నద్ధంగా ఉన్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈయన క్వారీలపైనా దృష్టి పెట్టి ఆర్థికంగా దెబ్బతీసేందుకు గానీ, దారిలోకి తెచ్చుకునే ఉద్దేశంతో గానీ ఈ పనికి దిగారు. ఏదేమైనా ఇప్పుడు డబ్బే అర్హతగా మారింది. అసెంబ్లీకి రూ.50 కోట్లు అవసరమవుతుండగా ఎంపీ అభ్యర్థిత్వం కావాలంటే ఈ రెండు పార్టీల్లో కనీసం రూ.100 కోట్లు పెట్టాలి. ఎంపీ మాగుంటను రూ.140 కోట్లు డిపాజిట్ చేయాలని ఇటీవల వైసిపి అధిష్టానం షరతు పెట్టిందనే చర్చ సాగింది. అయితే ఇప్పుడు ఆయనకు వైసిపి టిక్కెట్‌పై మెలిక పెట్టింది. డబ్బుతోనే అంతా నడుస్తోంది. ఎందుకంటే ఓటుకు రూ.2 వేలు ఇవ్వడమే.. ▶ 2లో



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

బిజెపి బెదిరింపులను టిడిపి ఎదుర్కోవాలి

- ప్రత్యేక హోదాపై గళం విప్పినందుకే గల్లాపై ఈడీ దాడులు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

మెయిన్ లో ▲



ఒంగోలులో స్పందనలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు వచ్చిన డ్వాక్రా మహిళలు

డ్వాక్రా మహిళల ఆందోళన

రూ.35 లక్షల స్వాహాపై

3లో ▲



ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

పెండింగ్ డిఆర్ బకాయిలు చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా

8లో ▲



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

జగనన్న కాలనీల్లో

మౌలిక సదుపాయాల సంగతేంటి?

- ఎన్నికల సమయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ల పేరుతో హడావుడి..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి ధ్వజం...

ప్రజాశక్తి-బాపట్ల

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఇళ్ల రిజిస్ట్రేషన్ పేరుతో హడావుడి చేస్తోందని, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి ధ్వజమెత్తారు. సోమవారం బాపట్ల ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్ అధ్యక్షతన పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోందన్నారు. కాలనీల్లో కనీస సౌకర్యాల కల్పనలో పూర్తిస్థాయిలో విఫలమైందన్నారు. వాస్తవానికి ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను నిర్మాణం చేసుకున్న వెంటనే చేసి ఉండాలని, ఇప్పుడు ఏదో సాధించేసినట్టు గొప్పలు చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామంటే గత్యంతరం లేక లక్షల రూపాయల అప్పులు చేసి ఇల్లు కట్టుకుంటే జగనన్న కాలనీలో రోడ్లు, మంచినీళ్లు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. ఎన్నికల ముందైనా ప్రభుత్వం ప్రజలకు నివాసానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ ▶ 2లో

కంచే చేను మేస్తే..

- గూడెం నుంచే మాయమవుతున్న రేషన్ బియ్యం
- అధికారులే ఇలా ఉంటే చెప్పేది ఎవరికి.?
- తెలిసినా పట్టించుకోని జిల్లా అధికారులు



ఆదివారం నాడు గూడెంలో దించకుండా లారీలో నుంచి లారీలోకి బియ్యం మారుస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

కంచె చేను మేస్తే ఇక ఎవరికి చెప్పుకోవాలి.? అవినీతి జరగకుండా కాపాడాల్సిన అధికారులే అవినీతి చేస్తూ.. జేబులు నింపుకుంటుంటే ఎవరిని అడగాలి.? శింగరాయకొండ సివిల్ సప్లై గూడెం అధికారులు జిల్లా కేంద్రం నుంచి వచ్చిన రేషన్ బియ్యాన్ని లారీలు మార్చి రైస్ మిల్లులకు తరలిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. పేదవాడి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

కొండపి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయమైన శింగరాయకొండలో ఉన్న సివిల్ సప్లై గూడెం నుంచి రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఆదివారం కూడా ఒంగోలు నుంచి వచ్చిన లారీని గూడెంలో దించిన తర్వాత లోకల్‌గా తిరిగే లారీల్లో బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. రేషన్ షాప్‌కు వెళ్లాల్సిన బియ్యాన్ని ▶ 2లో

డబ్బుంటేనే టిక్కెట్.!

(మొదటిపేజీ తరువాయి)

ఓటర్లను డబ్బుతో కొనడం ఆనవాయితీ చేశారు. ఎవరైతే ఓటర్లకు అడగకపోయినా వారి గెలుపు కోసం డబ్బులు ఇవ్వడం మొదలు పెట్టారో ఇప్పుడు వాళ్లే అక్రమమార్గంలో సంపాదించుకుంటున్నారు. భూకబ్జాలకు పాల్పడుతున్నారు. వివాదాస్పద భూములను కారుచౌకగా కాజేస్తున్నారు. వాటినే ఎన్నికల్లో పెడుతున్నారు. ఈ పని అధికారంలో ఉన్న పార్టీల కీలక నేతలే చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండే పార్టీ అభ్యర్థులు ఈ స్థాయిలో డబ్బు కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఇక దీంతో పాటు కులం కీలకంగా మారింది. మీ సామాజికవర్గం ఓట్లు నియోజకవర్గంలో ఎన్ని ఉంటే అన్నీ మీకు పడేలా చూసుకోవాలని పార్టీలు స్పష్టంగా చెప్పేశాయి. అభ్యర్థుల స్థానభ్రంశం ఇదే కోణంలోనే ఆలోచించి చేశారు. ఎన్నడూ లేని పద్ధతికి పాలకపక్షం తెరలేపింది. రాష్ట్ర ప్రభుత్వం భారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఒక వైపు ప్రచారం చేసుకుంటున్న వైసిపి ఇప్పుడు డబ్బు లేని అభ్యర్థులను ఎక్కడా పెట్టలేని పరిస్థితిలోనే ఉంది. డబ్బు లేకుంటే ఎన్నికలు లేవా? ఓట్లు పడవా? అంటే పార్టీలకే నమ్మకం లేదు. అందుకే ఎన్ని సంక్షేమ పథకాలు తెచ్చినా వాటి అమలులోనే తేడాలున్నాయి. అర్హులతో పాటు అనర్హులు పెద్దసంఖ్యలో రాజకీయ ప్రాబల్యంతో పొందుతున్నారు. ఇలాంటి పథకాలతో పేదల బతుకుల్లో మార్పులు కనిపించడం లేదు. అందుకే డబ్బుతోనే అన్ని రకాల అసంతృప్తులకూ తెర దించేయవచ్చనే ఆలోచన చేస్తున్నారు. ప్రతిపక్షం కూడా ప్రజాసమస్యలపై పోరాటాలను ఎజెండాగా తీసుకోకుండా డబ్బుతోనే ముందుకు పోతోంది. ఇలా పార్టీల నడకలోనే తప్పిదం ఉంది. వామపక్షాలే ప్రజాసమస్యలపై పోరాట ఎజెండాను తీసుకున్నాయి. డబ్బుతోనే ఎన్నికల్లో పాల్గొనే పార్టీలపై ఎన్నికల సంఘం కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అలాంటి వారి చర్యలను నియంత్రించాలి.

మౌలిక సదుపాయాల సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు ప్రయోజనం జరిగే స్థాయిలో కులగణన నిర్దిష్టంగా జరగటం లేదన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో పసుపు నిల్వ చేసుకున్న గిడ్డంగిలో అగ్ని ప్రమాదం జరిగి.. అందులో నిల్వ చేసుకున్న పసుపు అగ్నికి ఆహుతైందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ తుపానుకు నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని, సంక్రాంతి పండగ నాటికి నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సిఎం హామీ ఇచ్చారని, ఇప్పటివరకూ దాని ఊసే లేదని విమర్శించారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు టి కృష్ణమోహన్, సిహెచ్ మణిలాల్ పాల్గొన్నారు.

కంచే చేను మేస్తే..

(మొదటిపేజీ తరువాయి)

లారీలు మార్చుకొని గోడౌన్ అధికారుల సాక్షిగా కాంట్రాక్టర్ పక్కదారి పట్టించారు. లక్షల రూపాయలు జిల్లా అధికారులకు అప్పచెబుతున్నామని గోడౌన్ అధికారులతో పాటు కాంట్రాక్టర్లు చెప్పడం విశేషం. ఉన్నతాధికారులు శింగరాయకొండ సివిల్ సప్లయ్స్ గోడౌన్‌లో జరుగుతున్న బియ్యం అక్రమ తరలింపుపై ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే..

ఎంపిడిఒను సన్మానించిన అధికారులు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఎంపీడీవో రామచంద్రరావును అధికారులు సోమవారం సన్మానించారు. ఎంపీడీవో రామచంద్రరావు అందించిన సేవలను గుర్తించిన జిల్లా అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అవార్డును అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ అధికారులు ఎంపీడీవో రామచంద్రరావుకు సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్‌రాజా, పంచాయతీ కార్యదర్శులు రామప్రసాద్, చంద్రశేఖర్, వాణి, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు

డాక్టర్ గురుబ్రహ్మాం కన్నుమూత

ప్రజాశక్తి-కనిగిరి



డాక్టర్ గురుబ్రహ్మాం (ఫైల్)

మానవతావాది, కనిగిరి పట్టణానికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణులు సిహెచ్ గురుబ్రహ్మాం(80) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. ప్రభుత్వ వైద్యుడుగా కనిగిరి తాలూకాలో పనిచేసి కనిగిరిలో విశ్వదయ నర్సింగ్ హెూమ్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి పేదలను ఆదుకున్న మహానీయుడుగా పేరుపొందారు. వైద్యుడిగా పనిచేస్తూనే మరోవైపు సామాజిక సేవకుడిగా జిల్లాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తిగా, చిన్న పిల్లల వైద్యనిపుణులుగా, స్వచ్ఛంద సేవా సంస్థలకు మార్గదర్శ కుడిగా, సేవా కార్యక్రమాలు చేసే సామాన్య వైద్యుడిగా కనిగిరి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన భార్య సుగుణావతమ్మ ప్రముఖ మహిళా వైద్యురాలుగా సేవలు అందిస్తుండగా వారి కుమారుడు చెప్పరపు శ్రీనివాసులు న్యాయవాదిగా, కోడలు వైద్యురాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. సీనియర్ వైద్యులు గురుబ్రహ్మాం మృతి చెందిన విషయం తెలుసుకున్న కనిగిరి ప్రాంత ప్రజలు, పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, న్యాయ వాదులు, ఉపాధ్యాయులు, వైద్యులు, వివిధ పార్టీల నాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు.

డాక్టర్ గురుబ్రహ్మాంకు నివాళి

పిసిపల్లి: డాక్టర్ గురుబ్రహ్మాం అనేక సంవత్సరాలపాటు పీసీపల్లి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్‌గా పనిచేస్తూ అనేకమందికి వైద్య సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె లక్ష్మీసుజాత అన్నారు. సోమవారం పిసి పల్లి ప్రభుత్వ వైద్యశాలలో పలువురు ఆయనకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె లక్ష్మీసుజాత మాట్లాడుతూ ఒకవైపు వైద్యుడిగా, మరోవైపు సామాజిక సేవకుడిగా పీసీపల్లి మండలంలో అనేకమంది మన్ననలు పొందారని అన్నారు. కనిగిరిలోని తమ ప్రైవేటు వైద్యశాల డాక్టర్ సుగుణావతమ్మ హాస్పిటల్‌లో కూడా తక్కువ ఖరీదుకు, మరికొందరికి ఉచితంగా కూడా వైద్య సేవలు అందించిన మహోన్నత వ్యక్తిత్వం కలవాడని ఆయన సేవలను కొనియాడారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుండేవారన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కె లక్ష్మీ సుజాత, హెల్త్ సూపర్వైజర్లు రేణుకాదేవి, ఎం జకరయ్య, ఫార్మసిస్ట్ విజయలక్ష్మిబాయి, స్టాఫ్ నర్స్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ సావిత్రి, ఏఎన్ఎం జి సుబ్బమ్మ, సిబ్బంది కారు డ్రైవర్ ఎం బ్రహ్మారెడ్డి, సిఐటియు నాయకులు పి మహేష్, గ్రామస్తులు, ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.



పిసి పల్లిలో డాక్టర్ సిహెచ్ గురుబ్రహ్మాంకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

విద్యుత్ ప్రభల వెలుగులో రాజకీయ ప్రచారం

ప్రజాశక్తి-కురిచేడు

మండలంలోని పొట్లపాడు గ్రామంలో ఆదివారం రామయోగి స్వామి తిరునాళ్ల సందర్భంగా వైసిపి, జనసేన, టిడిపి పోటాపోటీగా పెద్దఎత్తున ఖర్చుపెట్టి ప్రభలు ఏర్పాటు చేసి వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ప్రభలపై ఆయా పార్టీల నాయకులు వైసిపి ప్రభలపై దర్శి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ శాసన సభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు పేదలకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కల్పించారని, రానున్న ఎన్నికల్లో మరలా వైసిపిని అధికారంలోకి



మాట్లాడుతున్న టిడిపి, జనసేన నాయకులు



మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి

తీసుకొని రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే దర్శి నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా తాను మరలా పోటీ చేస్తున్నానని, అందరూ కలిసికట్టుగా తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి దర్శి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకుపోదామని శివప్రసాదరెడ్డి అన్నారు. అలాగే జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభపై పాల్గొన్న జనసేన, టిడిపి నాయకులు గరికపాటి వెంకట్, దర్శి మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, జనసేన నాయకులు బొటుకు రమేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను రాబోయే ఎన్నికలలో తరిమికొట్టి రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించి నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రానికి పట్టిన పీడను వదిలించుకోవాలని వారు ప్రజలను కోరారు.

దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక కృషి

ప్రజాశక్తి-సిఎస్ పురం

కోవిలంపాడు గ్రామ పంచాయతీలోని మిట్టపాలెం గ్రామంలో వెలసిన నారాయణస్వామి దేవస్థానం అభివృద్ధికి పంచాయతీ తరపున తమవంతు కృషి చేస్తామని సర్పంచ్ షేక్ ఖాదర్బీబుజ్జి



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, ఆలయ చైర్మన్

తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో చైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఇఒ రమణారెడ్డిలతో ఆయన సమావేశమయ్యారు. దేవస్థానంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న పనులను పరిశీలించారు. అలాగే రాబోయే మహాశివరాత్రి తిరుణాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తమ వంతు ఏర్పాటు చేస్తామని అన్నారు. అందుబాటులో ఉండి దేవస్థానం వారికి అన్ని విధాలుగా సహకరిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారపుశెట్టి పాపారావు

టీడీపీలోనే బీసీలకు న్యాయం

ప్రజాశక్తి-దర్శి: టీడీపీలోనే బీసీలకు న్యాయం జరిగిందని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. ఆదివారం రాత్రి జయహో బీసీ కార్యక్రమం టీడీపీ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ ప్రసంగించారు. బీసీలకు సమన్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు. నారపుశెట్టి పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, తలారి కోటయ్య, వెంకటేశ్వర్లు, బేళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న సర్వర్

కులగణన సర్వేకు ఇక్కట్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కులగణన సర్వే ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఉపాధ్యాయులు చేయాల్సిన సర్వేను వాలంటీర్లు నిర్వహించడం పట్లఅనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత హడావుడిగా చేయాల్సిన అవసరం ఏమొచ్చిం దన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యర్రగొండపాలెం మండలంలో 21 సచివాలయాల పరిధిలో 21,324 కుటుంబాల నుంచి 65,329 మందిని సర్వే చేయాల్సి ఉంది. అందుకు గాను 362 మంది వాలంటీర్లు, 140 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28 నాటికి ఈ సర్వేను ముగించాల్సి ఉంది.

మొరాయిస్తున్న సర్వర్లు..

సర్వర్ సమస్య కారణంగా ఒక్కో ఇంటివద్ద 30 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. వాలంటీరు, కుటుంబ యాజమాని, సచివాలయ ఉద్యోగి ముగ్గురూ కలిసి రెండుసార్లు ఈకెవైసి (వేలిముద్రలు) వేస్తేనే ఆ కుటుంబం కులగణన పూర్తయినట్లు లెక్క. మధ్యలో సాంకేతిక సమస్యలు ఎదురవుతుండడంతో మళ్ళీ మొదటికొస్తోంది. యాప్ ఉదయం 8 నుంచి 10 గంటల లోపు మాత్రమే బాగా పని చేస్తుందని, మిగిలిన సమయంలో మొరాయిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు.



మ్యాపింగ్ సమస్య..

పట్టణాల్లో అద్దె ఇళ్లలో కాపురం ఉంటున్న వారు తరచుగా మారుతుంటారు. ఇలాంటి కుటుంబాలు ప్రతి సచివాలయం పరిధిలో 20 పైగా ఉంటున్నాయి. ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి. ఎవరైనా ఇతర ప్రాంతాల్లో వాలంటీర్ దగ్గర మ్యాపింగ్ చేయించుకోవాలంటే సమస్యలు ఎదురవుతున్నాయి.

ఆస్తుల గురించి ఆరా..

సెక్షన్-1లో వ్యక్తికి సంబంధించిన ప్రస్తుత జీవన స్థితి, చిరునామా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. కుటుంబంలో ఎంతమంది ఉన్నారో తదితర ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిందే. స్థిర, చరాస్తులతో పాటు కోళ్లు, పందులు, మేకలు, గొర్రెలు, పశువులు, లెక్క ఇలా 18 ప్రశ్నలకు యజమాని సమాధానం చెప్పాల్సి వస్తోంది. బియ్యం కార్డు సంఖ్య, ఇంటిరకం, పూరి గుడిసె, పెంకుటిల్లు, ఆర్‌సిసి బిల్డింగ్, డూప్లెక్స్ , మరుగుదొడ్ల సదుపాయం, తాగునీరు, గ్యాస్ తదితర వివరాలు అడుగుతున్నారు. సెక్షన్-2లో పుట్టిన తేదీ, వివాహస్థితి, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, వత్తి, పంట, భూమి, నివాస భూమి వివరాలు నమోదు చేయాల్సి ఉంది.

క్రిస్టియన్లు అన్న సమాచారం లేదు..

బీసీ-సీ క్రిస్టియన్లు ఉన్నారు కులాల విభాగంలో దగ్గర క్రిస్టియన్లు అన్న సమాచారం లేదు. ఉపకులం క్రిస్టియన్ అన్న ఆప్షన్ లేకపోవడం సర్వే సమయంలో ఇబ్బందిగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సంపన్న వర్గాలకు బియ్యం కార్డులు లేవు. ఇలాంటి కుటుంబాలను ఎలా నమోదు చేయాలో తెలియక సర్వే సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. సర్వే సమయంలో ఏదైనా పొరపాటు ఉంటే వాటిని సవరించుకునేందుకు ఆప్షన్ ఇబ్బంది ఎదురవుతోంది. ఏమైనా ఎన్నికల వేళ హడావుడిగా చేపట్టిన కుల గణన సర్వేపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తవుతున్నాయి. చాలా మంది యజమానులు సమాధానాలు చెప్పేందుకు సంకోచిస్తున్నారు. మరికొందరైతే కులాల వారీగా ఎన్నికల వేళ ఎంత మంది ఓటర్లు ఉన్నారో తెలుసుకునేందుకే కుల గణన సర్వే చేస్తున్నారని పేర్కొనడం గమనార్హం.

పాల ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

- ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పాల ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ఘటనలోఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో డ్రైవర్ తటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డాడు. హైవే మొబైల్ సిబ్బంది కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన శ్రీకాంత్ ఒంగోలులో ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రోజులాగే విధులకు హాజరయ్యేందుకు సోమవారం కారులో వెళుతున్నాడు. కారు మార్టూరు లోని ప్రభుత్వ వైద్యశాలకు సమీపంలోకి రాగానే ముందు వెళుతున్న పాల ట్యాంకర్ వేగం తగ్గింది. దీంతో డ్రైవర్ అదుపు చేయలేక కారు ట్యాంకర్‌ను ఢీకొంది. అదే సమయంలో కారులోని ఎయిర్ బ్యాగ్ లు తెరుచుకోవడంతో శ్రీకాంత్ స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు స్పందించి కారులో ఇరుక్కుపోయిన శ్రీకాంత్‌ను బయటకు తీశారు. హైవే మొబైల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని స్థానిక వైద్యశాలకు తరలించారు.

'వెలిగొండ'పై కల్లబొల్లి మాటలొద్దు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూరైందని కల్లబొల్లి మాటలు చెప్పవద్దని టిడిపి యర్రగొండపాలెం నియోజక వర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆరోపించారు. పుల్లలచెరువు మండలం చాపలమడుగు పంచాయతీ పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో రామయోగి స్వామి తిరునాళ్ల సందర్భంగా టిడిపి ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. ఈ ప్రభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పాతాళానికి తొక్కారని ఆరోపించారు. బటన్ నొక్కడం తప్పా ఈ ప్రాంతానికి చేసిన మంచి పని ఏదో చెప్పాలని నిలదీశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పి.ప్రసాద్, నాయకులు శనగా నారాయణరెడ్డి, కోటా డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

22న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల గ్రామంలో వచ్చేనెల 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అమరత్వ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు స్పందన విద్యాసంస్థల డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రపై తాలూకా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యుద్ధంలో వీర ఈ సందర్భంగా ఆర్మీ జవాన్లు, కవులు, సామాజిక కార్యకర్తలకు ,వ్యాస రచన పోటీల్లోని విజేతలను ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ నారాయణరెడ్డి,రాచర్ల ప్రధానోపాధ్యాయులు రామానాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జగ్గుల మాలకొండమ్మ, ఎంఆర్ సేవా సంస్థ వ్యవస్థాపకులు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రూ.35 లక్షల స్వాహాపై డ్వాక్రా మహిళల ఆందోళన

ప్రజాశక్తి-నాగులుప్పపాడు

రుణాల స్వాహాపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల పరిధిలోని ఒమ్మెవరం గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు ఉప్పుగుండూరులోని యూనియన్ బ్యాంకు ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. విఒఎ కోటా అనిత రూ.35 లక్షల రుణాలను స్వాహా చేసిందని ఈ విషయంపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. తొలుత వారు ఒంగోలు వెళ్లి ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, డిఆర్‌డిఎ పీడీకి ఫిర్యాదు చేశారు.అనంతరం యూనియన్ బ్యాంకు వద్ద ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ తమకు తెలియకుండా స్త్రీనిధి, పొదుపు డబ్బులు గ్రామ సమైఖ్య సంఘానికి మళ్లించినట్లు తెలిపారు. ఈ ఘటనలో బ్యాంకు మేనేజర్ ,ఫీల్డ్ ఆఫీసర్, ఎపిఎం , సిసిల పాత్ర ఉన్నట్లు వారు ఆరోపించారు. తాము దాచుకున్న పొదుపు డబ్బులను తమ ప్రమేయంలేకుండా గ్రామ సమైఖ్య సంఘానికి మళ్లించడం ఏమిటని వారు బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నించారు. తమ ఖాతాల్లోని నగదు స్వాహా అయినట్లు వారు తెలిపారు. శ్రీలత అనే మహిళ రూ. 5.25లక్షలు రుణం తీసుకున్నట్లు ఉందన్నారు. ఇలాగే పలువురు రుణాలు తీసుకున్నట్లు రికార్డుల్లో ఉందన్నారు. శ్రీనిధి నుంచి తాము రుణాలు తీసుకోలేదని తెలిపారు. విఒఎ చేతి వాటం వల్లే ఇలా జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులను గుర్తించాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళల ఆందోళన గురించి తెలుసుకున్న శ్రీనిధి ఎజిఎం హర్షవర్ధన్ డిఆర్‌డిఎ అసిస్టెంట్ అధికారి వరప్రసాదు బ్యాంకు వద్దకు చేరుకొని మేనేజర్‌ను విచారించారు. ఎవరి ఖాతాను నుంచి ఎంత స్వాహా అయ్యిందో లిఖిత పూర్వంగా ఇవ్వాలని డ్వాక్రా మహిళలకు సూచించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నగదు స్వాహా చేసిన నిందితులను గుర్తిస్తామని వారు తెలిపారు.


బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న డ్వాక్రా మహిళలు


పాదయాత్ర నిర్వహిస్తున్న ఇమ్మడి కాశీనాథ్

రాష్ట్రంలో నిరంకుశ పాలన : ఇమ్మడి

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

శ్రీపూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా సాధనకై జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్ చేపట్టిన పాదయాత్ర రెండో రోజు సోమవారమూ కొనసాగింది. ఈ పాదయాత్ర మండల పరిధిలోని యాచవరం, నాయుడుపల్లి, మన్నెవారిపల్లి, రాయవరం గ్రామాల్లో సాగింది. పాదయాత్రకు టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నట్లు విమర్శించారు. రాష్ట్ర ప్రజలందరూ వైసిపి అరాచక పాలన గమనిస్తున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని ఆయన కోరారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తే పేదలు బతికే పరిస్థితి ఉండదని తెలిపారు. ఈ నేపథ్యంలో వైసిపిని ఇంటికి సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు శాసనాల వీరబ్రహ్మం జనసేన పార్టీ నాయకులు, శ్రీ అల్లూరి పోలేరమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ బొందిలి కాశీరాం, సింగ్, సిరిగిరి శ్రీనివాసులు, విజయరావు, నరసింహారావు, పిన్నిబోయిన శ్రీనివాసులు, గుంటూ రత్నకుమార్, డి. చంద్రశేఖర్, ఓర్సు శంకరయ్య, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే 'అన్నా' కే టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి- కొమరోలు

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబుకు టిక్కెట్ కేటాయించాలని వైసిపి నాయకులు కోరారు. కొమరోలు గ్రామంలో ఎమ్మెల్యే అన్నాకు మద్దుతుగా సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి సారే వెంకటనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి గెలవాలంటే అన్నా రాంబాబుకు తప్పనిసరిగా టిక్కెట్ ఇవ్వాలన్నారు. వైసిపి సీనియర్ నాయకుడు సుబ్బారాయుడు మాట్లాడుతూ గత ఎన్నికలో గిద్దలూరు నియోజకవర్గంలో 82,000 మెజారిటీ గెలుపొందిన అన్నా వెంకట రాంబాబుకు టిక్కెట్ ఇవ్వక పోతే పార్టీ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన పథకం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

మధ్యాహ్న భోజన పథకానికి మెనూ ఛార్జీలు పెంచాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒ కావడి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సంఘం నాయకులు లక్ష్మీదేవి, కుమారి, నరసమ్మ, సిఐటియు నాయకులు టి.ఆవులయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు ఆదిలక్షమ్మ, సునీత ,రంగమ్మ పాల్గొన్నారు.

రాచర్ల : మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒ గిరిధర్ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి డి. థామస్ ., కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు ఎ. నాగలక్ష్మి, పద్మావతి, భాగ్యమ్మ ,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పల్లెపాలెం మహిళలు

పల్లెపాలెం వాసుల వినతి

ప్రజాశక్తి - బాపట్ల

సముద్ర తీర ప్రాంతంలో చేపల పెట్టి జీవనాధారంగా పూరిగుడిసెల్లో జీవనం సాగిస్తున్న మత్స్యకార మహిళలు నివేశన స్థలాల సదుపాయం కల్పించి గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరుతూ స్పందనలో కలెక్టర్ పి రంజిత్ భాషాకు వినతి పత్రం అందజేశారు. చినగంజాం మండలం పెదగంజాం శివారు పల్లెపాలెం మత్స్యకార మహిళలు సుమారు 200 మంది ప్రత్యేక వాహనాల్లో కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని స్పందనలో వినతిపత్రం అందజేశారు. సముద్రానికి అత్యంత చేరువలోని పెదగంజాం పల్లెపాలెంలో పక్కాగ్రహాలు లేక ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే బిక్కు బిక్కుమంటూ ప్రాణాలు అరచేత పెట్టుకుని కాలం గడపాల్సి వస్తోందని తెలిపారు. గ్రామానికి చెందిన ఎస్ లక్ష్మి, వి భార్గవి, కే భూ లక్ష్మి, కె మీరమ్మ, దేవకి, వి వెంకటేశ్వరమ్మ, నాగేంద్రం పాల్గొన్నారు.



న్యాయమూర్తిని సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

నిబద్ధతతో పనిచేస్తే గౌరవం

ప్రజాశక్తి - చీరాల

నిబద్ధతతో పనిచేసే వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఎప్పుడు ఉంటుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్కె రెహాన అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఒకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవం స్థానిక రోటరీ క్లబ్‌లో సోమవారం నిర్వహించారు. సభలో ఆమె మాట్లాడారు. ఉత్తమ సేవా కార్యక్రమాలు చేసేవారిని ప్రత్యేకంగా గుర్తించి, వారికి వృత్తి నైపుణ్య అవార్డుల ప్రదానోత్సవంను చేస్తున్న రోటరీ సేవలు అభినందనీయమని అన్నారు. వివిధ రంగాలలో విశేష సేవలందిస్తున్న 9మందిని సన్మానించి, అవార్డులు అందజేశారు. సన్మాన గ్రహీతలైన డివి సుబ్బారావు, యు లక్ష్మణ్, అలసందలపల్లి సుబ్బయ్య, సందు నాగరాజు, దాసరి బుల్లెమ్మ, గుత్తి విశ్వేశ్వరరావు, నందనవనం రాఘవశర్మ, టి ఏడుకొండలు, వీరాస్వామికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, బి హేమంత్ కుమార్, బాల గోకుల్ కుమార్, పోలుదాసు రామకృష్ణ, గుర్రం రాఘవరావు, జివై ప్రసాద్, వలివేటి మురళీకృష్ణ, జాలాది కృష్ణ, కె శ్రీనివాసబాబు పాల్గొన్నారు.



వ్యవసాయ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వ్యవసాయ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

రైతులకు అవసరమైన వ్యవసాయ సమాచారాన్ని పొందుపరుస్తూ వ్యవసాయ శాఖ రూపొందించిన డైరీని కలెక్టర్ పి రంజిత్ భాష సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను స్పందన మందిరంలో జెసి చామకూరి శ్రీధర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, రైతు శిక్షణ కేంద్రం డిడిఎ విజయనిర్మల, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు కె ధనరాజు, కార్యదర్శి వెంకటకృష్ణ, కోశాధికారి లోకేశ్వరి పాల్గొన్నారు.

వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

వెలుగు విఓఏల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఈనెల 30, 31తేదీల్లో విజయవాడలో 36గంటల మహాధర్నాకి విఓఏలు తరలిరావాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్, ఐకెపి విఓఏ అధ్యక్షులు ఎల్ శేషుకుమారి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా విజయవాడలో జరిగే ఆందోళనలో బాగంగా సమస్యలు పరిష్కరించాలని మండల సమాఖ్య అధ్యక్షురాలికి సోమవారం వినతి పత్రం అందచేశారు. వెలుగు విఓఏల సమస్యలు మిద ప్రభుత్వానికీ అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపద్యంలో మహాధర్నా చెప్పట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి వెంటనే 3సంరాలు కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేయాలని కోరారు. ఉద్యోగ భద్రత లేకుండా భయపెడుతూ మూడేళ్ల పనిచేసి తర్వాత ఇళ్లకి వెళ్ళమనటం ఏమిటని ప్రశ్నించారు. హెచ్ఆర్ పాలసి



ఐకెపి విఓఏ అధ్యక్షులు ఎల్ శేషుకుమారి

అమలు చేయాలని, రూ.10లక్షల గ్రూప్ ఇన్సరెన్స్, విఓలు మెర్జింగ్ ఆపాలని కోరారు. డ్వాక్రా సభ్యులతో బలవంతపు కొనుగోళ్లు ఆపాలి, 15గ్రూపులు కంటే తక్కువ ఉన్నా విఓఏలకు వేతనం అమలు చేయాలనే సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ధర్నాకి తరిలి రావాలని కోరారు. కార్యక్రమంలో మండలంలో ఐకేపీ విఓఎలు ఉమాదేవి, తిరుపతమ్మ, స్వాతి పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

ప్రజాశక్తి - చీరాల

పేదల సంక్షేమమే లక్ష్యంగా, పేదల అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని వైసిపి ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ బాబు అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ ఆవరణంలో వైఎస్ఆర్ ఆసరా 4వ విడత సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా 4వ విడతలో మున్సిపాలిటీ పరిధిలోని 957ఎస్‌హెచ్‌జి సంఘాలకు రు.6.49కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేసి జగనన్నను సిఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైసిపి



సమావేశంలో వైసిపి ఇన్‌చార్జి కరణం వెంకటేష్

పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జీ, గుంటూరు మాధవరావు, మల్లెల లలిత రాజశేఖర్, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, మెప్మా సీఎంఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లదే కీలకపాత్ర

ప్రజాశక్తి - పంగులూరు

జల జీవన్ మిషన్ పనుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లదే కీలక పాత్రని ఆర్డబ్ల్యూఎస్ ఎఈ శివయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జలజీవన్ మిషన్ జల సంఘ కమిటీల మార్గదర్శక సూత్రాలపై అవగాహన కల్పించారు. మార్గదర్శక సూత్రాలను తప్పక పాటించాలని కోరారు. గ్రామ తీర్మానం మేరకు 11మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకోవాలని తెలిపారు. ఇందులో తొమ్మిది మంది డ్వాక్రా సంఘాల నుండి, పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండాలని తెలిపారు. అయితే జలజీవన్ మిషన్ పనులు చేయించడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని అన్నారు. మండలానికి రూ.1498.89లక్షల జలజీవన్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటితో 25పనులు మంజూరైనట్లు తెలిపారు. పనులను పార్ట్ ఎ, పార్ట్ బి రెండుగా చేయాలన్నారు. మొదటి పార్ట్‌లో మెటీరియల్ మొత్తం ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, పార్ట్ బి క్రింద కమ్యూనిటీ కాంట్రాక్టు కమిటీకి అప్పగిస్తందని తెలిపారు.



సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎఈ శివయ్య

అందుకోసం జల సంఘం కమిటీలను ఏర్పాటు చేసి, ఆ సంఘాలకు బ్యాంక్ అకౌంట్లను తీసుకోవాలని చెప్పారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎస్టిమేషన్ ఎగ్జిబిషన్, ఎం - బుక్ రికార్డులు చేయాలన్నారు. పనులను జేఈ చెక్ చేయాలని తెలిపారు. ఈఓఆర్డి బి రాంబాబు, మండల పరిషత్ సూపర్నెంట్ తానికొండ రమేషు మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు అకౌంటెంట్ భాస్కరమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డాక్రా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

పంచ వృత్తి దారులు కమ్మర, వడ్రంగం, కంచరి, శిల్పి, స్వర్ణకార వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచ వృత్తి దారుల సంఘం పట్టణ కమిటి ఆధ్వర్యంలో తహశీల్దారు అశోక్‌వర్ధన్‌కు వినతి పత్రం సోమవారం అందజేశారు. సంఘం పట్టణ కార్యదర్శి మంకెన యోహాను మాట్లాడుతూ మారిన పరిస్థితులకు అనుగుణంగా వృత్తుల్లో కొనసాగుతున్న 50ఏళ్లు దాటిన వృత్తి దారులకు నెలకు రూ.7వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. భవిష్యత్తు సమాజ రక్షణ కోసం వృత్తులు, వృత్తి దారుల సంక్షేమానికి నిపుణులతో కూడిన అధ్యయన కమిటి వేయాలని కోరారు. రేపటి సమాజం బాగు కోసం సహజమైన ఆహార ఉత్పత్తిని కాపాడు కొనేందుకు, రేపటి సమాజాన్ని నేడే దోచుకునేందుకు తెగ బడుతున్న విధానాలను నిలువరించాలని కోరారు. పనిలో



తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న వృత్తిదారులు

అవయవాలు కోల్పోయిన వృత్తి దారులకు ప్రమాదం స్థాయిని బట్టి వయస్సుతో సంబందం లేకుండా అర్హులైన వృత్తి దారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. వృత్తి దారులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శన చేసేందుకు జిల్లాస్థాయిలో అమ్మకపు అంగళ్ళ సముదాయం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, గుత్తి శ్రీనివాసబాబు. పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.

కన్నాపై రాళ్లదాడి హేయమైన చర్య

ప్రజాశక్తి - భట్టిప్రోలు



శ్రీనివాసరావు

పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం తొండేపిలో మాజీ మంత్రి, టీడీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ మూకల రాళ్ల దాడిని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన కొనసాగుతుందని అన్నారు. కన్నా లక్ష్మీనారాయణపై జైలు పార్టీ నేతలు రాళ్ల దాడి చేయడం పతనానికి నాంది పలుకుతుందని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పలనాడు ఎస్పిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ప్రజలంతా బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.



ధర్నా చేస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు

క్రాంతి పథం ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - బాపట్ల

వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేసే ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని కోరుతూ డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతి పథం ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం బాపట్లలో 7వ రోజుకు చేరింది. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు.



సమావేశంలో టిడిపి ట్రైనర్ కొల్ల సుబ్బరాయుడు

టిడిపిని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - మెదరమెట్ల

టిడిపిని బలోపేతం చేయడానికి కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు నడవాల్సిసిన అవసరం ఉందని టిడిపి ఇంటిగ్రేటెడ్ శిక్షకుడు కొల్ల సుబ్బారాయుడు అన్నారు. టిడిపి నాయకులతో సోమవారం ఆయన మాట్లాడారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని అన్నారు. ఓటర్లకు అర్థమయ్యే విధంగా మాట్లాడాలని అన్నారు. ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్న ఓటర్లను చేర్చటం, అర్హత లేని ఓటర్లను తొలగించడం వంటి కార్యక్రమాలకు ముందుకు నడవాలని సూచించారు. మన్నే ప్రసాద్, మేదరమెట్ల శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, చావా రాజేష్, మంద నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు జాగర్లమూడి జయకృష్ణ, జాగర్లమూడి వీరాంజనేయులు, కారుసాల గురుబాబు, నాదెండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.ద

ఫోన్ పోతే ఫిర్యాదు చేయాలి

ప్రజాశక్తి - చీరాల



సెల్ ఫోన్లు అప్పగిస్తున్న సిఐ

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాదితుల ఫిర్యాదు మేరకు సాంకేతిక వరిజ్ఞానాన్ని ఉవయోగించి 8సెల్ ఫోన్లను వన్ టౌన్ సిఐ శేషగిరిరావు బాధితులకు అందజేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు దారులను పిలిపించి అందజేశారు. సెల్ఫోన్ పోగొట్టుకున్న బాధితులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్ఫోన్లను రికవరీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024



పసుపు రైతుల సదస్సులో మాట్లాడుతున్న ఆనందబాబు

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

మాజీ మంత్రి ఆనందబాబు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందజేయాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు డిమాండ్ చేశారు. సోమవారం దుగ్గిరాలలో వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల రైతులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీలో రైతులు గిట్టుబాటు ధర కోసం నిల్వ చేసుకున్న పసుపు అగ్ని ప్రమాదానికి గురికావడం బాధాకరమన్నారు. ఈ కోల్డ్ స్టోరేజీలో వేమూరు నియోజకవర్గంలో భట్టిప్రోలు, కొల్లూరు మండలాల రైతులు అధిక శాతం నిల్వ చేసుకున్నారని వీరికి తీవ్ర నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పసుపు కాలిపోయి నష్టపోయిన రైతులకు ప్రస్తుత మద్దతు ధర ప్రకారం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19వ తేదీన సంఘటన జరిగితే ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పసుపు నిల్వలపై తీసుకున్న రుణాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ఎస్‌పి మలికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించటానికి ఎస్పీ మల్లికగర్గ్ సోమవారం పోలీస్ స్పందన కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల వినతులను ఎస్పీ స్వీకరించారు. అందిన ఆయా ఫిర్యాదులపై ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఆ ఫిర్యాదులపై తక్షణ విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోని భాధితులకు న్యాయం అందించాలని, స్పందన ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా నిర్ణీత గడువులో ఫిర్యాదులు పరిష్కారించాలని అధికారులను ఎస్పీ గారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్/భూ/ఆర్థిక తగాదాలు, అత్తరింటి వేదింపులు మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి.



ఎస్‌పి మలికగర్గ్

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- తనకు ఒంగోలులోని ఇందిరమ్మ కాలనీలో ప్లాట్ ఇప్పిస్తానని ఒంగోలు చెందిన శివాజీ అనే వ్యక్తి నమ్మించి రూ. 2,61,000 తీసుకొని ప్లాట్ ఇప్పించగపోగా కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని మద్రిపూడి మండలంకు చెందిన ఓ బాధితుడు ఫిర్యాదు.
- ఒంగోలులోని గ్రంథాలయ కార్యాలయంలో అటెండర్ గా ఉద్యోగం ఇప్పిస్తామని యర్రగొండపాలెం మండలానికి చెందిన బాల చెన్నయ్య అనే వ్యక్తి రూ. 1,40,000 తీసుకొని తర్వాత ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని పెద్ద దోర్నాల మండలానికి చెందిన ఓ బాధితుడు ఫిర్యాదు.
- అదనపు కట్నం కోసం తన భర్త మరియు అతని కుటుంబ సభ్యులు కలిసి తనను పలు విధాలుగా వేధిస్తున్నారని సింగరాయకొండ మండలంకు చెందిన ఒక మహిళ పిర్యాదు.

స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్.వి శ్రీధర్ రావు పాల్గొన్నారు.

టిడిపి గెలుపు అత్యవసరం

45వ డివిజన్‌లో 'జనం కోసం జనార్ధన్'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు అత్యవసరమని, చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పేర్కొన్నారు. జనం కోసం జనార్ధన్, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం ఒంగోలు నగరంలోని 45వ డివిజన్‌లో నిర్వహించారు. డివిజన్‌కి చేరుకున్న దామచర్ల జనార్ధన్‌రావుకి పార్టీ నాయకులు ముఖ్యంగా మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు ఇంటింటికీ వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరెడ్డి, బండారు మదన్, వేమూరి వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షులు అరిటిపల్లి చెంచిరెడ్డి, పగిడి రాములు, యాదల రాధ, తోక వీరయ్య, గోళ్ళ వెంకటేశ్వర్లు, రావుల పద్మజ, కే కుసుమకుమారి, పసుపులేటి సునీత, టి.రమాదేవి, షేక్ అజిమున్నీసా, నాయకులు, కార్యకర్తలు పాలొన్నారు.



జనార్ధన్‌కు హారతి ఇస్తున్న మహిళ

సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఫిర్యాదుదారుల సమస్యలను వేగవం తంగా పరిష్కరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమ వారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి 58 మంది ఫిర్యాదిదారులు వచ్చి వారి సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించు కున్నారు. ఎస్పీ ఫిర్యాదిదారుల సమస్యలను విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే వాటిపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజలు వారికి ఉన్న సమస్యల పరిష్కారానికి పోలీస్ అధికారులను ఆశ్రయించినప్పుడు వారి సమస్య పరిష్కారం అవుతుందనే ధైర్యాన్ని వారిలో పెంపొందించి, చట్టపరిధిలో వారి సమస్యలను పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరించినా, సమస్యల పరిష్కారంలో జాప్యం చూపినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.




సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్‌జిందాల్

స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా తెలిపారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశం మందిరంలో సోమ వారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవించారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. స్పందన, జగనన్నకు చెబుదాం వెబ్ పోర్టల్ లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. చీరాల ఆర్డీవో పరిధిలో 6 అర్జీలు పెండింగ్ లో ఉండడంపై వీక్షణ సమావేశం ద్వారా ఆయన సమీక్షించారు. అలాగే వివిధ శాఖలో పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీశారు. నమోదయ్యే అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులను ఆయన ఆదేశించారు. తదుపరి వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించిన బ్రోచర్లు, 2024 డైరీ, క్యాలెండర్‌లను కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకట రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

అర్జీలపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు జెసి కె.శ్రీనివాసులు ఆదేశం
- డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పందనలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, సత్వరమే పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ కె . శ్రీనివాసులు, అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాల్లో జరిగిన "స్పందన" మరియు " డయల్ యువర్ కలెక్టర్ " కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి విన్నతులను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జెపి మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని, ఫిర్యాదులు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుండి విజ్ఞప్తులు వచ్చినపుడు సకాలంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన కార్యక్రమం లో వచ్చే ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అవసరమైతే వ్యక్తిగతంగా తనిఖీ చేసి సంతప్తికరంగా పరిష్కార మార్గం చూపించాలన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో 236 అర్జీలు వచ్చాయన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న జేసీ శ్రీనివాసులు

ఆక్రమణదారుల నుంచి స్థలాన్ని కాపాడండి

ఆక్రమణదారుల నుంచి తమ స్థలాన్ని కాపాడాలని ఒంగోలు కేశవస్వామిపేటకు చెందిన కావూరి సత్యానందం జెసికి అర్జీ ఇచ్చారు. తాము 47 ఏళ్ళ నుంచి సర్వే నెంబర్ 842/1 ప్లాట్ నెంబర్ 945లో నివాసం ఉంటున్నామన్నారు. స్థలానికి ప్రహారీగోడ కట్టుకుంటుండగా పక్క స్థలంలోని జొన్నలగడ్డ సుబ్బరాజు, సింగమ్మలు పనిని అడ్డుకున్నారని, కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతున్నారన్నారు. స్థలాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన జెసి ఈవిషయమై చర్యలు తీసుకోవాలని ఒంగోలు తహాశీల్దార్‌ను ఆదేశించారు.

డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్ లో ప్రస్తావించిన వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

- పొన్నలూరు మండలం, రెడ్డిపాలెం గ్రామం నుండి డి. బ్రహ్మయ్య ఫోన్ చేసి తనకు వైఎస్ఆర్ జలకళ పథకంలో బోరు మంజూరైందని సర్వే కూడా చేశారన్నారు. ఇప్పటివరకు బోరు వేయలేదని, త్వరగా బోరు వేయాలని జెసిని కోరారు. ఆయన స్పందిస్తూ ఈ సమస్య ను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు.
- పొన్నలూరు మండలం, రెడ్డిపాలెం గ్రామం నుండి డి. దత్తాత్రేయ ఫోన్ చేసి, తనకు వైఎస్ఆర్ జలకళ పథకాన్ని వర్తింప చేయాలని జెసిని కోరారు. ఆయన స్పందిస్తూ సమస్య ను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు.
- కనిగిరి మండలం, పునుగోడు గ్రామం నుండి ఎం. సుబ్బారెడ్డి ఫోను చేసి, తన భూమి సర్వే నెంబరు 272 ఖాతా నెంబరు 1206 ఉందని, ఆన్ లైన్ లో 1 బి రావడం లేదని, వచ్చేలా చూడాలని జెసిని కోరారు. విషయమై స్పందిస్తూ సమస్యను పరిశీలించి, పరిష్కరించాలని, కనిగిరి తహసీల్దార్ ను అదేశించారు.

కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వర రావు, వరప్రసాద్, ఝాన్సీ లక్ష్మి, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనసేనలోకి జడా బాలనాగేంద్ర

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రకాశం జిల్లా కాంగ్రెసు పార్టీ మాజీ అధ్యక్షులు జడా బాలనాగేంద్ర యాదవ్ సోమవారం జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పాల్గొన్నారు.



'జడా'కు పార్టీ కండువా కప్పుతున్న నాదెండ్ల



ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కలిసిన వడియరాజులు

గొట్టిపాటికి వడియరాజుల మద్దతు

ప్రజాశక్తి - సంతమాగులూరు

వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అడుగడుగున దగాపడ్డారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు సమీపంలోని ఆయన అతిథి గృహంలో ఏల్చూరు గ్రామానికి చెందిన కొందరు వడియరాజుల కుటుంబాలు కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని అన్నారు. సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు, ఉపాధి అవకాశాలు లేక యువత తీవ్ర నిరాశకు గురైనట్లు చెప్పారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోని పరిస్థితి ఉందని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరాశ నిస్పృహాలకు గురైన వైసీపీ నేతలు టిడిపి వైపు ఆకర్షితులు అవుతున్నారని తెలిపారు. టిడిపి నాయకులు అట్లా పెద్ద వెంకటరెడ్డి, ఏల్చూరు గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.



కర్ర సాము పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

జాతీయస్థాయికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 13వ రాష్ట్రస్థాయి సిలభం (కర్ర సాము) పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించి అండర్ 8, 9, 10,12విభాగాల్లో గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో టి మేధో కార్తీక్, ఎం తేజన్‌రెడ్డి, వై చేతన్ సాయికుమార్, వై రాఘవ సాయికుమార్, కె హితేష్, టి తిరుమల కార్తికేయ రెడ్డి, యు దక్షిత్, టి హర్షవర్ధన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు. విద్యార్థులను స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి, ప్రిన్సిపాల్ నర్గీస్ క్యారీ, పిడి నాంచారయ్య అభినందించారు. ఫిబ్రవరి 18, 19తేదీల్లో తిరుపతిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ద

వైసీపీ నేతలవి మతిభ్రమించిన మాటలు

ప్రజాశక్తి - వేమూరు



యార్లగడ్డ గోపి

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక వైసీపీ నాయకులు పతిభ్రమించి మాట్లాడటం సరి కాదని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి యార్లగడ్డ గోపి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి పాలన పతనానికి సిద్ధమైందని అన్నారు. పిసిసి అధ్యక్షులు షర్మిలపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు సరైన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

పోలింగ్ బూతుల పరిశీలన

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సంతమాగులూరు సీఐ నరసింహారావు మండలంలోని గుంటుపల్లి, అంబడపూడి, బల్లికురవ, వేమవరం, ఉప్పుమాగులూరు, కోటవారిపాలెం, కొప్పరపాలెం పోలింగ్ బూతులను సోమవారం పరిశీలించారు. ఎస్ఐ వేమన, ఎఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల తొలగింపు

పోరాటానికి సిద్ధమవుతున్న వైనం..

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రతిరోజు వీధులను శుభ్రం చేసే పంచాయితీ కార్మికులు టైమింగ్ గురించి ప్రశ్నించారన్న కారణంతో పంచాయితీ కార్యదర్శి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు నిర్ధేశించిన సమయానికన్నా ముందే పనిలోకి రాలేదన్న కారణంతో ఇంక మీరు పనికిరావక్కర్లేదంటూ హుకుం జారీ చేశారు. మండలంలోని రామన్నపేట పంచాయితీ పారిశుధ్య కార్మికులను సమయపాలన లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు పిలిపించి పనులు చేయిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. జీతాలు సైతం బ్యాంక్ అకౌంట్లో వేయకుండా ఇళ్లకు వచ్చి డబ్బులు ఇచ్చి వెళ్ళిపోతుంటారని చెబుతున్నారు. తమకు ఎలాంటి గుర్తింపు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటి మాటలతో ఇంకా పనిలోకి రావద్దని అనటం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బాలిక సురేంద్రను వివరణ కోరితే ప్రతినెలా కచ్చితంగా వేతనం ఇస్తున్నామని, పండగకు ఒక నెల అడ్వాన్స్ ఒక్కొక్కళ్ళకి రూ.3వేలు ఇచ్చామని తెలిపారు. అయినప్పటికీ పనికి రమ్మని కార్యదర్శి హెూదాలో రెండు గంటలసేపు బతిమిలాడినా బెట్టు



శర్మతో రామన్నపేట పారిశుద్ధ్య కార్మికులు

చేశారని తెలిపారు. ఇప్పుడు తాను తీసేశానని ప్రచారం చేస్తున్నారని అన్నారు. వాళ్ళని బతిమాడాల్సిన పని తనకేంటని అన్నారు. వాళ్లే పనిలోకి నిరాకరించడంతో కొత్త వాళ్ళతో పని చేయించుకుంటున్నామని అన్నారు. ఇప్పుడు మళ్ళీ వస్తానంటే తాను ఎలా తీసుకుంటామని ఎదురు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎంవిఎస్ శర్మాను పంచాయతీ కార్మికులు కలిసి తమ ఆవేదనను చెప్పుకున్నారు. తమకు న్యాయం జరగని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయితీ వర్కర్స్ తోపాటు సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి మచ్చ అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులకు ద్రోహం చేసిన జగన్

టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను

ప్రజాశక్తి - బాపట్ల

గిరిజనులకు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తీరని ద్రోహం చేశారని టిడిపి బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను ఆరోపించారు. టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ సూచనల మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక గిరిజనులు సంక్షేమానికి నోచుకోలేదని అన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో గిరిజనుల అభివృద్ధికి అమలు చేసిన 16పథకాలను వైసిపి రద్దు చేసిందన్నారు. వైసిపి పాలనలో గిరిజన ప్రజా సంస్థలైన ట్రైకార్, సహకార సంస్థ, సలహా మండలి, ఐటిడిఎ నిధులు, పిటిజి నిధులు పక్కదారి పట్టించారని అన్నారు. గిరిజనులకు జగన్ ప్రభుత్వం అన్యాయం



మాట్లాడుతున్న తిరుమలశెట్టి శ్రీను

చేసిందన్నారు. రాష్ట్రంలో గిరిజనులు టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇండ్ల శ్రీనివాస రావు, నంబూరి ఏడుకొండలు, అడ్డూరీ వెంకటేశ్వర్లు, ఇండ్ల శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీను, కట్టా సుజాత, శంకర్, నక్కా వెంకటేశ్వరరావు, గున్నం అంకమ్మరావు, వీరయ్య, నాంచారయ్య, కోమరగిరి అంకమ్మరావు, గంధం శ్రీను, జయరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి వాలంటీర్లు

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అర్హులకు అందించే విధంగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వాలంటరీ వ్యవస్థ వారది అని వైసిపి ఇన్‌ఛార్జి పానెం చిన్న హనిమిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన వాలంటరీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు చేరే విధంగా వాలంటరీ వ్యవస్థను తీసుకువచ్చారని అన్నారు. దీనిలో భాగంగా ఎలాంటి అవినీతికి తోవ లేకుండా నేరుగా లబ్దిదారునికి సంక్షేమాలు అందించే గొప్ప వ్యవస్థని అన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమాలు రాకపోతే వారికి వచ్చే విధంగా చూడాలని కోరారు. అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా నేరుగా ఇంటి వద్దకు వాలంటరీ వచ్చి తెలుసుకుని అవ్వ తాతలకు 1వ తేదీన ఆదివారమైన, సెలవు రోజైన పెన్షన్లు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, జడ్పిటిసి చింతల అంజలి శ్రీనివాస్, గుంటుపల్లి సర్పంచ్ మాదాల కృష్ణకుమారి శివన్నారాయణ, వైస్ ఎంపీపీ ఇప్పల వెంకటసుబ్బారెడ్డి, వైసిపి నాయకులు శంకరరెడ్డి, వల్లపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, చెన్నుపల్లి వైసిపి నాయకులు ఏల్చూరి రవీంద్ర, కో ఆప్షన్ సభ్యులు ఎస్కె శ్రీనువలి, మద్దినేని అశోక్, పావులూరు చందు పాల్గొన్నారు.



గుళ్లపల్లిలో గడపకులో వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్

చెరుకుపల్లి : వైసిపి ఇన్చార్జి డాక్టర్ ఈవూరి గణేష్ తన స్వగ్రామమైన గుళ్ళపల్లిలో ఇంటింటి ప్రచారం సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకొని తనను గెలిపించాలని కోరారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ కేశవతి, డాక్టర్ సృజన్, రేపల్లె ఎఎంసి వైస్ చైర్మన్ ఉల్లంగుంట శ్రీరామమూర్తి, ఉల్లంఘట రామారావు, వంగరు భాను, పొన్నపల్లి సత్యనారాయణ, వంగరు సాయిబాబు పాల్గొన్నారు.

నేడు కొప్పెరపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - పంగులూరు

జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత వైద్యశిభిరం మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఈ నెల 30న మంగళవారం జరుగుతుందని పిహెచ్‌సి డాక్టర్ కె శివచెన్నయ్య తెలిపారు. ఉచితంగా బిపి, షుగర్, హెచ్‌బి, హెచ్ఐవి, కంటి వైద్య పరీక్షలు, ఈసిజి, పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, కుష్టి, క్షయ వ్యాధికి, జ్వరాలకు సంబంధించిన చికిత్సలు, పరీక్షలు చేస్తారన్నారు. వచ్చేవారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో తూర్పు తక్కెలపాడు గ్రామస్తులు కూడా పాల్గొనాలని కోరారు. వచ్చేవారికి ఆటోలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



సమావేశంలో తహాశీల్దారు సంధ్యశ్రీ

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లపై శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సంభందించి అధికారులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. స్థానిక మండల పటిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో తహశీల్దారు సంధ్యాశ్రీ మాట్లాడుతూ మండలంలో ఇంటి నివేసా స్థలాలు తీసుకున్న లబ్ధిదారులు 1430మంది ఉన్నట్లు తెలిపారు. వారికి ప్రభుత్వం ఇప్పుడు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించనున్నట్లు తెలిపారు. మంగళవారం నుండి లబ్ధిదారులను సచివాలయాలకు పిలిపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఒఆర్డీ రామకృష్ణ, విఆర్ఒలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పి అపర్ణ

దంతాలు శుభ్రం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

లయన్స్ క్లబ్ పేరాల అంకినీడు ఆధ్వర్యంలో పేరాల ఆంధ్ర రత్న పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు దంత సంరక్షణ శిబిరం సోమవారం నిర్వహించారు. ఉచితంగా బ్రష్, పేస్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భండా దంత వైద్యులు డాక్టర్ పి అపర్ణ మాట్లాడుతూ దంతాల సంరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. రోజుకు రెండు పూటలా బ్రష్ చేసుకోవడం ద్వారా పళ్ళను కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి సాల్మన్ రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ అంకినీడు అధ్యక్షులు దొంతినేని శ్రీకాంత్, కార్యదర్శి శ్రీనివాసు, అమర్నేని ఉదయ భాస్కర్, నల్లూరి కృష్ణ, సరోజ, పవని భానుచంద్ర మూర్తి, రమణారావు, సుందర రామిరెడ్డి పాల్గొన్నారు.



నివేసిన స్థలాలు కోరుతూ కలెక్టరేట్ ఎదురు నక్కలోళ్ళు

నివేశనా స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

దళిత బహుజన రీసర్చ్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు సహకారంతో చీరాల పట్టణంలో తోపుడు బండ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటున్న నక్కలోళ్ల కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. గతంలో జగనన్న కాలనీలో పది కుటుంబాల కు నివేశన స్థలాలు మంజూరయ్యాయి. అయితే సాంకేతిక కారణాలతో వారికి ఇళ్ల స్థలాలు చూపించలేదు. మరో 8 కుటుంబాల వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వైకుంఠపురం సచివాలయం పరిధిలోని నక్కల కులస్తులు చీరాల సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదురు ప్రధాన వీధిలో తోపుడుబండ్లపై చిన్న చిన్న వస్తువులు అమ్ముకుని ఏళ్ల తరబడి రోడ్లపై నివసిస్తున్నారు.

ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు

ప్రజాశక్తి - నిజాంపట్నం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ జి శివ నాగరాజు తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు సంబంధించి కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టంపై శిక్షణ నిర్వహించారు. ఈఓపీఆర్డి తాతా శివ శంకరరావు, కార్యాలయం ఏఓ రమేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలందరూ కష్టపడి పనిచేయాలి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు ఏడుకొండలు

ప్రజాశక్తి - పంగులూరు

టిడిపి అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని టిడిపి సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు కోరారు. రానున్న 75రోజులు ఎంతో విలువైనవని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలను కలిసి కార్యోన్ముఖులను చేయాలని అన్నారు. ముప్పవరంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు తీసుకువచ్చిన బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. దీని ద్వారా 18ఏళ్ల నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకి రూ.1500 ఆర్థిక సహాయం, అమ్మకు వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ ఏడాదికి రూ.15వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, బీసీల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా బలోపేతం చేయటం వంటి పథకాలు అమలు చేస్తారని చెప్పారు. వీటన్నిటినీ ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వైసిపి వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. వైసీపీ అవినీతి, అక్రమాలు, నియంతత్వ పోకడలను ప్రజలకు అర్థమయ్యే రీతిగా కార్యకర్తలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు మానం రమేష్ బాబు, టిడిపి ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, 29వ యూనిట్ అధ్యక్షులు యేనికపాటి అశోక్, మురకొండ సుబ్బారావు పాల్గొన్నారు.

అద్దంకి : ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో క్లస్టర్ వారీగా ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ గురించి చర్చించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ మాట్లాడుతూ టిడిపి పాలనతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. స్థానిక నేతలు ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించి గ్యారెంటీ కార్డులను అందజేయాలని అన్నారు. మహాశక్తి, అన్నదాత, యువగళం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి రక్షిత మంచి నీటి పథకంతో పాటు పూర్ టు రిచ్ పదకాలు అమలు చేస్తామని అన్నారు. చంద్రబాబు సిఎం కావాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్థిక తోడ్పాటునందిస్తాం అన్నారు. అభయహస్తం పథకాన్ని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా అన్ని కళాశాలలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింప చేస్తామని చెప్పారు.

చీరాల : వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, అలాంటి పాలనకు ప్రజలు సాగనంపాలని టిడిపి ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని తోటవారిపాలెం పంచాయతీలో టిడిపి ఆధ్వర్యంలో పోలేరమ్మ గుడి ప్రాంగణంలో బూదాటి నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం సోమవారం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. రాష్ట్రంలో పురోభివృద్ధి లేదని అన్నారు. రైతాంగానికి సాగు నీరు అందిచలేక క్రాప్ హాలిడే ప్రకటించుకోండని, నీరందించ లేమని ప్రభుత్వం చెప్పిందని అన్నారు. కార్యక్రమంలో గుద్దంటి చంద్రమౌళి, ఎం గౌరీ అమర్నాథ్, గంజి పురుషోత్తం, గజవల్లి శ్రీనివాసరావు, శ్రీరాం రమేష్, వంకా హరికృష్ణ, డేగల వెంకటేశ్వర్లు, మల్లెల వేణు, కాటం రామకృష్ణ, తాడి సత్యనారాయణ, రంగినేని అనీల్, రత్నబాబు, ఉసురుపాటి సురేష్, గోసాల శ్రీను, చెరుకూరి శ్రీను, కౌతరపు జనార్ధనరావు, జైరాం, దరీషా పాల్గొన్నారు.



సమావేశంలో టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య

బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక బిబిహెచ్ జూనియర్ కళాశాల ఒకటి నుంచి పది ర్యాంకులు పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రధానం చేశారు. బండ్ల బాపయ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కాలర్షిప్ టెస్టులో ఉత్తీర్ణైన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బండ్ల బాపయ్య విద్యా సంస్థల అధ్యక్షులు బండ్ల అంకయ్య, ఉపాధ్యక్షులు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ లేళ్ళ కృష్ణమూర్తి, జాయింట్ సెక్రెటరీ వాసుదేవరావుచ నిత్యాన్నదాత గొల్లపూడి సీతారాం, కళాశాల ప్రిన్సిపల్ పి బాలసుబ్రహ్మణ్యం, ఇన్చార్జి హెచ్ఎం బి వీరభద్రయ్య పాల్గొన్నారు. పరీక్షలో అక్కల అజిత్‌రెడ్డి ప్రథమ, గుత్తి బాలసుహైల హాన్సిని ద్వితీయ, బి జయశ్రీ తృతీయ బహుమతులు సాధించారు. మరో ఏడుగురికి కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు.

నేడు భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టు నేపథ్యంలో మనోవేదనకు గురై మృతి చెందిన కుటుంబాలకు భరోసా కల్పించేందుకు నేనున్నానంటూ నిజం గెలవాలంటూ నారా భువనేశ్వరి ఈనెల 30న పర్యటిస్తారని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేసిన చంద్రబాబు అక్రమ అరెస్టుతో రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది కలత చెంది ఆందోళనతో మృతి చెందారన్నారు. ఆయా కుటుంబాలకు ధైర్యం చెప్పేందుకు భువనేశ్వరి వస్తున్నారని తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఆమెకు అండగా నిలవాలని కోరారు. ఈనెల 30న గన్నవరం ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరి రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లికి మద్యాహ్నం 1.50 గంటలకు చేరుకుంటారని తెలిపారు. అక్కడ నుంచి 2.10కి ఆరుంబాక చేరుకుంటారని, అక్కడ 40నిమిషాలు భోజనం విరామం తీసుకుంటారని అన్నారు. అనంతరం బాపట్ల, జమ్ములపాలెం, రేటూరు, అప్పాపురం, కాకుమాను, పెదనందిపాడు మీదుగా సాయంత్రం 4:30 గంటలకు పర్చూరు నియోజకవర్గంలోని చిననందిపాడు చేరుకుంటారని అన్నారు. అక్కడ మువ్వా సింగారావు కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతారని తెలిపారు. అక్కడి నుంచి పర్చూరు మీదుగా సాయంత్రం 5.30గంటలకు యద్దనపూడి చేరుకుంటారని తెలిపారు. అక్కడ మృతి చెందిన టెక్కెం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని తెలిపారు. అనంతరం మార్టూరు మీదుగా ఒంగోలు చేరుకుంటారని తెలిపారు.

నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దపులివర్రు పంచాయతీలోని పెదపాలెం గ్రామంలో గత ఐదు ఏళ్ల క్రితం ప్రభుత్వం నుండి మంజూరైన నిధులతో అంగన్‌వాడి భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి టిడిపి ప్రభుత్వ పాలనలో రూ.7లక్షలకుపైగా నిధులు మంజూరు కావడంతో భవన నిర్మాణం చేపట్టి స్లాబ్ దశకు తీసుకువెళ్లారు. ఆ తర్వాత ఎన్నికలు సమీపించాయి. ఎన్నికల్లో ప్రభుత్వం మారిపోవడంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వైసీపీ పాలల్లోనైనా అంగన్‌వాడి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి కేంద్ర నిర్వహణకు అవకాశం కల్పిస్తారని గ్రామ ప్రజలు భావించారు. ఈ భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో భవనంలో పెద్దపెద్ద చెట్లు పెరిగిపోయి నిర్మాణాలు పూర్తి కాకుండానే గోడలు పగుళ్ల దశకు చేరాయి. పిచ్చి చెట్లు, పెద్ద చెట్లతో నిండిపోవడంతో పాములు, జరులు చేరటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నామని వాపోతున్నారు. అప్పటి ప్రభుత్వం మండలంలో 30వరకు అంగన్‌వాడి కేంద్ర భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. వాటిలో కొన్ని నిర్మాణం పూర్తి కాగా మరికొన్ని వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను నిర్లక్ష్యం చేసింది. అప్పట్లో చేపట్టిన నిర్మాణ పనులు తామెందుకు పూర్తి చేయాలనే దృకృథంలో కూడా నాయకులు వ్యవహరించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీని కారణంగా అక్కడక్కడా కొంతమేర జరిగిన నిర్మాణ పనులు కూడా నిరుప యోగం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆనాడు జీఓ ప్రకారం నిధులు విడుదల చేసి ఉండగా వాటిని ఏ ప్రభుత్వం మారినా సద్వినియోగ పరిస్తే ప్రజలకు మేలు జరిగేదని, తమకెందుకులే అని నిర్లక్ష్యం వహిస్తే ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎక్కడ ఒక భవనం కూడా నిర్మించిన దాఖలాలు లేవని, గతంలో మంజూరు చేసిన నిధులతో చేపట్టిన భవనాలను పూర్తి చేసినా కొంతమేర అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు ఏర్పడేవని అంటున్నారు. ఈ కారణంగా అనేక చోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇలా నిర్మాణ దశలో నిలిచిపోయిన భవనాలు ఒక పెదపాలెంలో మాత్రమే కాదని, మండలంలో వివిధ గ్రామాల్లో ఇదే దుస్థితి నెలకొందని చెబుతున్నారు. నిలిచిపోయిన భవనాల్లో చెట్లు పెరిగి, పాములు వృద్ధి చెందుతున్న దృష్ట్యా సంబంధిత అధికారులు చొరవ చూపి దీనిపై చర్యలు చేపట్టాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణ పనులు నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం



గెలుపొందిన ఏల్చూరు క్రికెట్ టీం

ఏల్చూరు టీం ఘనవిజయం

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఆడుదాం ఆంధ్రలో భాగంగా సోమవారం నియోజకవర్గ స్థాయిలో సింగరకొండ వద్ద జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన క్రికెట్ టీం, కొరిశపాడు క్రికెట్ టీంపై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కొరిశపాడు 10ఓవర్లకి ఏడు వికెట్ల నష్టానికి 83 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఏల్చూరు టీం మూడు బంతులు మిగిలి ఉండగా మూడు వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసి విజయం సాధించారు. దీంతో ఏల్చూరు గ్రామ పెద్దలు, యువకులు క్రికెట్ టీంకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీం కోచ్‌లు బ్రహ్మాం, అనిల్, నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లెపాలెం మహిళలు

పారిశుద్ధ్యంపై అవగాహన

ప్రజాశక్తి- సంతమాగులూరు

తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సెర్ప్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్లో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు, పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యర్థాలు సేకరించకపోతే డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధులు సోకుతాయన్నారు. అలాగే వ్యర్థాలను తగుల పెట్టుట వల్ల కాలుష్యం పెరిగి మానవ జీవనానికి ప్రమాదంగా ఉందన్నారు. వ్యర్థాల సేకరణ కేంద్రాల్లో తడి వ్యర్థాలను ఎరువుగా, పొడి వ్యర్థాలను రీసైకిలింగ్ చేయవలసిన అవసరం ఉందన్నారు. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. వ్యర్థాల ద్వారా ఎరువులు తయారు చేయాలన్నారు. గ్రామాల్లో వీధులు, కాలువలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామ ప్రసాద్, శిక్షణ ట్రైనర్స్ ప్రదీప్, ఏసోబు పాల్గొన్నారు.

సారస్వత నికేతనకు విరాళం

ప్రజాశక్తి - వేటపాలెం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాఖ కోశాధికారి, ఎన్టీఆర్ క్లబ్ సభ్యులు వంకాయ లపాటి హరిబాబు రూ.6వేల నగదును స్థానిక సారస్వత నీకేతనం గ్రంధాలయంకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటపాలెం లైబ్రరీకి జాతిపిత మహాత్మా గాంధీజీ విచ్చేసిన ఘనత వుండటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు వుండటం తెలుగు వారిగా మనకు ఎంతో గర్వకారణం అన్నారు. సిబిఐ పూర్వ సహ సంచాలకులు వివి లక్ష్మీనారాయణ సూచన మేరకు 2023వ సంవత్సరం ప్రతి నెలా రూ.1వెయ్యి ఇస్తానని ప్రకటించిన మేరకు రూ.6,116ఇంతకు ముందు ఇచ్చినట్లు తెలిపారు.



నగదు అందజేస్తున్న వి హరిబాబు



మేయర్‌కు అర్జీ ఇస్తున్న సిఐటియు నేతలు, మున్సిపల్ వర్కర్లు

కోవిడ్ కార్మికులకు
పెండింగ్ వేతనాలివ్వాలి

మేయర్‌కు వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ కార్మికులకు రెండు నెలల నుంచి ఆరు నెలల పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు సోమవారం నగర మేయర్ గంగాడ సుజాతకు వినతిపత్రం అందజేశారు. వేతనాలు బకాయిలు ఉండటం వల్ల కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. వెంటనే జోక్యం చేసుకొని పెండింగ్ బకాయిలు ఇప్పించాలని కోరారు. కోవిడ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నెంబర్ ఏడు ప్రకారం వారికి నెలకు 15 వేల రూపాయలు అందజేయాలని, సెలవులు వర్తింపజేయాలని కోరారు. వారికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పనులకు రాని వారికి మస్టర్‌వేసి వారి వద్ద నుంచి ఇన్స్‌పెక్టర్లు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆ దోపిడీని అరికట్టాలని కోరారు. మేస్త్రీల సంఖ్య తగ్గించాలని, లేని పక్షంలో మహిళలను కూడా మేస్త్రీలుగా నియమించాలని కోరారు. అధికారులు, కార్పొరేటర్ల ఇళ్లలో పనిచేసేవారిని విధుల్లోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, యూనియన్ నాయకులు టి విజయ, కె పద్మ, భారతి, అంజమ్మ, కమల, ఆర్ వాసు, మరియమ్మ, థామస్ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

7వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సెర్ప్ ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 7వ రోజుకి చేరుకుంది. సెర్ప్ ఉద్యోగులు కలెక్టర్ నుంచి బయలుదేరి అంబేద్కర్ విగ్రహం, చర్చి సెంటర్, తిరిగి సమ్మె శిబిరం వరకు అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టారు. సెర్ప్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలియజేసిన ఏపీ ఎన్జీవో సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె.శరత్‌బాబు మాట్లాడారు. ఏఐటియుసి జిల్లా నాయకులు ఎస్‌డి సర్దార్, ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసన్న, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏడుకొండలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. సమ్మెలో జెఎసి నాయకులు బి గోపీనాథ్, కష్ణ, నారాయణ పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనతో ఉద్యోగుల నిరసన

పెండింగ్ డిఆర్ బకాయిలు చెల్లించాలి

- కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా - సంఘీభావం ప్రకటించిన ఎపి ఎన్జీవో అసోసియేషన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంకిరెడ్డి అధ్యక్షత వహించారు. ధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన ఎపి ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శరత్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెన్షనర్లకు 11వ పిఆర్‌సి ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలన్నారు. పెన్షనర్ల ఆందోళన కార్యక్రమానికి ఎపి ఎన్జీవో అసోసియేషన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు బి.అంకిరెడ్డి మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో 2022 జనవరి 1 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను యథావిధిగా అమలు చేయాలన్నారు. 70 సంవత్సరాలు నిండిన వారికి 10 శాతం, 75 సంవత్సరాలు నిండిన వారికి 15 శాతం పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ పరిధి రూ.2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.సుబ్బారావు, కోశాధికారి జి.రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ప్రసాద్, రామారావు, వెంకట్రావు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బాపట్ల కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల: వృద్ధాప్యంలో పెన్షనర్లు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా విభాగం పెన్షనర్స్ సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చెరుకూరి సుబ్బారావు మాట్లాడుతూ వృద్ధాప్యంలో పెన్షనర్లకు న్యాయం జరగాలని కోరుతూ ఈ వయసులో రోడ్డెక్కి ధర్నా చేయడం బాధగా ఉందన్నారు. హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవి భవానీప్రసాద్, కోశాధికారి జి.ఎస్.ఆర్.కే.ప్రసాద్, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

'సెక్షన్ 38' వల్ల ముప్పుపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు

ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టం-2022కు వ్యతిరేకంగా ఒంగోలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నల్లూరి సత్య శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యర్రజర్ల, కందులూరు, మర్లపాడు, టంగుటూరు, కొండపి, పాలేటిపాడు, ఎం.నిడమానూరులలో పర్యటించి సెక్షన్ 38 వల్ల కలిగే ముప్పు గురించి ప్రజలకు వివరించారు. యాక్ట్ వల్ల సామాన్యులకు జరిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో లైబ్రరీ సెక్రటరీ పాలవెల్లి సంజీవరెడ్డి, ఎస్‌కె అజీజ్, పి.బాబ్జీ, సురేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలిస్తాం

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఒంగోలు మండలం వలేటివారిపాలెం గ్రామంలో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సభలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల పట్టాలు పంపిణీ విషయంలో సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యమైందని తెలిపారు. మంచి లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని, అందరూ ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఎవరు ఓట్లు వేసినా, వేయకపోయినా మొదటి నుంచి గ్రామ అభివృద్ధితో పాటు, ప్రజల సమస్యలు పరిష్కరించడమే తనకు తెలుసని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులకు ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే వారు సచివాలయాలలో సంప్రదించాలని కోరారు. వైసిపి సీనియర్ నాయకులు చుండూరి రవి మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో దాదాపు 30 వేల నుంచి 40 వేల పట్టాలు ఇచ్చేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని, అలాంటి నాయకుడిని మరలా గెలిపించుకోవాలని కోరారు. వలేటివారిపాలెం గ్రామంలో వంద ఇళ్ల పట్టాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి కోమలేశ్వరి, ఎంపిపి మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌ఒ మురళి, ఎంపిడిఒ ఉషారాణి, సర్పంచ్ రాఘవ, ఎంపిడిఓ అజిత, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో పట్టాలిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామ పంచాయతీ పరిధిలో సాగు చేసుకుంటున్న రైతులు 217 మందికి 330 ఎకరాలకు సంబంధించిన పట్టాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పట్టాలను ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం పేదలకు సేవ చేయటంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోడూరి గోపి, మాజీ ఎంపిపి వాయల మోహన్‌రావు, అగ్రికల్చర్ రిపోర్ట్ చైర్మన్ ఆళ్ళ రవీంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.